వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 122 | ఎడిటర్ : తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి | అక్టోబర్ 2024 | వెల : రూ 10/-

# దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు



- రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్ ముందు
- దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకం
- రాడార్ కేంద్రానికి శంకుస్థాపనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్
- రుణ వ్యవస్థ పటిష్టం చేసుకోవడంలో ముందున్నాం
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,

పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు. అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ

-మిగతా 3 లో




## ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు

- దేశీయంగా డేటా భద్రంగానే ఉంటుంది
- టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీని ప్రారంభించిన మోడీ

న్యూఢిల్లీ

నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ-2024 ఈవెంట్ ఈ ఏడాది దిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రధాని నరేంద్ర

-మిగతా 3 లో



## మెస్‌చార్జీల పెంపుపై కసరత్తు పూర్తి చేయండి

- గురుకులాల్లో నాణ్యమైన విద్య అందించాలి
- కార్యదర్శులు బాధ్యత వహించి సందర్శించాలి
- అద్దె భవనాల కిరాయి వెంటనే చెల్లించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

హైదరాబాద్

ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

-మిగతా 3 లో



## గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

- పలు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ

-మిగతా 3 లో

# మహారాష్ట్ర, జార్ఖండ్‌లో మోగిన ఎన్నికల నగారా



- మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్
- జారఖండ్‌లో రెండు విడతల్లో నవంబర్ 13,20న ఎన్నికలు
- రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 23న ఓట్ల లెక్కింపు
- ఉత్తరప్రదేశ్‌లో 9 అసెంబ్లీ స్థానాలకు 13న ఉప ఎన్నిక
- కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి

న్యూఢిల్లీ,

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరుపనున్నట్టు సీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. నామినేషన్ల గడవు అక్టోబర్ 29వ తేదీతో ముగుస్తుంది. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 30న

-మిగతా 3 లో



## ఢిల్లీ-షికాగో విమానానికి బాంబు బెదరింపు

అత్యవసరం కెనడాకు మళ్లించిన సిబ్బంది

న్యూఢిల్లీ,

దేశీయంగా నడిచే, విదేశాలకు వెళ్లే పలు విమానాలకు బాంబు బెదిరింపులు హెచ్చరికలు రావడం కలకలం సృష్టిస్తోంది. తాజాగా దిల్లీ నుంచి షికాగో వెళ్తున్న ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో విమానాన్ని అత్యవసరంగా కెనడాకు మళ్లించినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. దిల్లీ-షికాగో మధ్య నడిచే

-మిగతా 3 లో



## వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ

- అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఖర్గేకు
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడి

ఢిల్లీ:

కేరళలో ఒక లోక్‌సభ, రెండు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ బరిలో దిగుతున్నట్టు ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. పాలక్కడ్, చెలక్కార (ఎస్సీ) అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులుగా రాహుల్ మమ్‌కూటథిల్, రమ్య హరిదాస్ పేర్లను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంపిక చేశారు.

-మిగతా 3 లో



## రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి

- ఇందుకోసం కేంద్రంతో కలసి పనిచేస్తాం
- రాజ్‌నాథ్‌కు ఘనంగా స్వాగతం పలికిన సిఎం

వికారాబాద్,

రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని సీఎం రేవంత్

-మిగతా 3 లో

## విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారు

- అద్దెలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులకు చెల్లింపుల్లేవు
- రోడ్డెక్కిన విద్యార్థుల సమస్యలు సీఎంకు పట్టడంలేదు: కేటీఆర్

హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకుల భవనాలకు అద్దె, కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

-మిగతా 3 లో



# లండన్‌లో తొలిసారిగా దసరా అలయ్ బలయ్

-అలయ్ బలయ్- ఉత్సాహంగా వేడుకలు
- హాజరైన ప్రముఖులు




-హైదరాబాద్

హైదరాబాద్ తర్వాత ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా విదేశీ గడ్డపై అలయ్ బలయ్ సంస్కృతికి నాంది పలికారు. కుల,మతాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపై తీసుకురావడమే లక్ష్యంగా యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో దసరా అనంతరం అలరుబలరు ఉత్సవాలు నిర్వహించారు. తెలుగు మాట్లాడే ప్రతి ఒక్కరిని ఇందులో భాగస్వాములను చేశారు. ఈ కార్యక్రమానికి యూకే నలుమూలల నుంచి వచ్చిన మిత్రులు, వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలకు చెందిన ప్రముఖులు, డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంంలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నట్టు కార్యక్రమ నిర్వాహకులు సికా చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలరు బలరును ప్రతి సంవత్సరమూ నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. తెలంగాణ వంటకాలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని లండన్ సౌత్‌హాల్ మాజీ పార్లమెంటు సభ్యులు వీరేంద్ర శర్మ ప్రారంభించారు. యూకేలో తటస్థ వేదిక ఏర్పాటు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా లండన్‌లో ఉంటూ కూడా ఎంతో మంది మిత్రులను కలుసుకునే అవకాశాలు లేకుండాపోయాయని అభిప్రాయపడ్డారు. ఇప్పుడీ వేదిక ద్వారా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఎలాంటి జెండా, అజెండా ఈ కార్యక్రమానికి లేదనీ, ఇది కేవలం స్నేహపూర్వక కలయికేనని వ్యాఖ్యానించారు. జమ్మి ఆకు ఇచ్చి పుచ్చుకుని అందరూ దసరా ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందని చంద్రశేఖర్ చెప్పారు.

# నేడు జమ్మూకాశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం

- సీపీఐ(ఎం) నేత ప్రకాశ్‌కరత్‌తో
- సహా వివిధ పార్టీల నేతలు హాజరు



న్యూఢిల్లీ బ్యూరో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో మొదటగా ఎన్నికైన ప్రభుత్వం నేడు కొలువుదీరనుంది. ఈ రాష్ట్ర పదో సీఎంగా, విభజిత జమ్మూకాశ్మీర్ మొదటి ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11:30 గంటలకు శ్రీనగర్‌లోని ఎస్కె ఇంటర్నేషనల్ సెంటర్ (ఎస్‌కెఐసీసీ) లో జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఒమర్ అబ్దుల్లాతో పాటు మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎస్‌కెఐసీసీని పూలతో అలంకరించడంతో పాటు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జివన్ మాలిక్, ఆప్ జాతీయ కార్యదర్శి పంకజ్ కుమార్ గుప్తా, స్వతంత్ర ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పయారే లాల్ శర్మ, సతీష్ శర్మ, మహ్మద్ అక్రమ్, రామేశ్వర్ సింగ్, ముజాఫర్ ఇక్బాల్ ఖాన్ మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్, ఎస్పి అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే, శిరోమణి అకాలీదళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో పాటు వివిధ పార్టీల నేతలు హాజరు కానున్నారు. ఆయా పార్టీల నేతలు ఇప్పటికే శ్రీనగర్ చేరుకున్నారు. జమ్మూ కాశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హొదా కల్పించాలని సమాజ్‌వాదీ పార్టీ

# వనస్థలిపురం సిఐ శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన రాపోలు లింగస్వామి




ఎల్ బీ నగర్ అక్టోబర్ 15/ ప్రజా స్వేచ్ఛ

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సిఐ గా శ్రీనివాస్ నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, దసరా పండుగను పురస్కరించుకొని ఆర్ టి ఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కుమ్మర మంగళవారం వనస్థలిపురం లోని ఆయన కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్ట్ గా, ఆర్ టి ఐ కార్యకర్తగా సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం సంస్థ చేస్తున్న సేవలను వివరించి పరిచయం చేసుకోవడం జరిగింది. అనంతరం శాలువా కప్పి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# ఎన్నికల్లో ఉచిత హామీలపై సుప్రీం నోటీసులు

-స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, ఈసీలకు ఆదేశాలు



న్యూఢిల్లీ:

ఎన్నికల ప్రచారాల్లో రాజకీయ పార్టీలు చేసే ఉచిత వాగ్దానాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్(ఈసీ)ను కోరింది. బెంగళూరుకు చెందిన శశాంక్ జె శ్రీధర దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ జె.బి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపిపై చర్యలు తీసుకున్నది. శశాంక్ పిటిషన్‌ను అడ్వొకేట్ శ్రీనివాసన్ కోర్టుకు సమర్పించారు. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వకుండా నిరోధించేలా ఈసీ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. అనియంత్రిత ఉచిత హామీలు ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడేలా చేస్తాయనీ, ఓట్లు పొందిన తర్వాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటానికి ఎలాంటి యంత్రాంగమూ లేదని తెలిపింది. ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పలు కేసులతో కలిపి దీనిని విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. తక్షణ విచారణ జరపాలన్న సీనియర్ అడ్వొకేట్ విజరు హన్సారియా, పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగెంట్ అశ్వినీ ఉపాధ్యాయుల అభ్యర్థన తర్వాత కోర్టు పై విధంగా స్పందించింది. ఉచిత వాగ్దానాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయనీ, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే ప్రజాకర్షక చర్యలపై పూర్తిగా నిషేధం విధించాలని ఉపాధ్యారు తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ పద్ధతిని అరికట్టడానికి చర్యలను తీసుకోవాలని ఈసీని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చే అహేతుకమైన ఉచిత హామీలు ఓటర్లను ప్రభావితం చేస్తాయనీ, దీంతో ఎన్నికల ప్రక్రియ సమగ్రత దెబ్బ తింటుందని వివరించారు.

# ప్రజలకు సేవ చేయరా?



హైదరాబాద్

డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ క్యాట్‌లో పిటిషన్లు వేసిన ఐఏఎస్‌లకు చుక్కెదురైంది. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) స్పష్టం చేసింది. ఈనెల తొమ్మిదిన కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఏ. వాణిప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి. సృజనకు అక్కడ ఊరట లభించలేదు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు.. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవచేయాలని మీకు లేదా ? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం మార్గదర్శకాల్లో ఉందా ?' అని క్యాట్ ఐఏఎస్‌లను ప్రశ్నించింది. ఏక సభ్య కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరపు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫారసుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీచేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి, రొనాల్డ్‌రాస్ తదితరులు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. అలాగే ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీచేయాలనీ, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దుచేయాలని ఐఏఎస్‌లు తమ పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దుచేయడంతోపాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని క్యాట్‌ను కోరారు. వాదనల అనంతరం డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించిన క్యాట్, ప్రతివాదులైన కేంద్రం, డీవోపీటీలకు నోటీసులు ఇచ్చింది. నవంబరు ఐదులోపు కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ ఐఏఎస్‌లకు ఆదేశాలు జారీ చేసింది.

# దుర్గ భవాని నవరాత్రి ఉత్సవాలు





ప్రజా స్వేచ్ఛ

బైరమల్ గూడా సాయి నగర్ కాలనీ శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్లో బ్రహ్మశ్రీ వేదపండితులు ప్రధాన అర్చకులు శ్రీ శ్రీ శ్రీ రాహుల్ శర్మ ప్రశాంత్ ఆచార్య శర్మ పండితులు గురు స్వామి గారి ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గ భవాని నవరాత్రి ఉత్సవాలు ఈ రోజు స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షణాయనం ఆశ్వీజ శుద్ధ నవమి శుక్రవారం ఈరోజు మహిషాసుర మర్దని దేవి అవతారంలో ఈ నవరాత్రుల్లో మాత్రమే మహా మహిమాన్విత అమ్మవారి ప్రత్యేక పూజలు అభిషేకాలు ప్రతిరోజు చండీ హెూమాలు నిర్వహించి ప్రతిరోజు పలు రకాలు విశేషా అలంకారాలు బ్రహ్మశ్రీ మహా వేద పండితులచే ప్రవచనాలు వేద పండితులచే లలితా సహస్రనామాలతో వేద మంత్రాలచే ప్రతినిత్యం గణపతి పూజ కుంకుమ పూజ అఖండ దీపారాధన లక్ష్మీ గణపతి హెూమం గాయత్రి అన్నపూర్ణాదేవి హెూమం అమ్మవారికి నిత్య పూజలు చండి పారాయణం కుంకుమార్చనలు మహాభిషేకాలు మహా నైవేద్యాలు అతి ఘనంగా వైభవంగా భక్తుల మధ్యలో పిల్లలు పెద్దలు మహిళా మణులు ముత్తైదువులు అందరూ కలిసి హెూమ పూజా కార్యక్రమంలో అమ్మవారికి పంచారతులు పంతులు గార్లచే ఆశీర్వచనములు భక్తి పాటలు భజనలు జరుగు చున్నవి హారతులు తీర్థ ప్రసాదములు సమర్పించబడు చున్నవి అమ్మవారి విశేష పలు అవతారాల దర్శనాలు దర్శించి అనుగ్రహ పాత్రులు అవుతున్నారు విశేష కార్యక్రమం లు జరుగుచున్నవి ఈరోజు ముఖ్య అతిథులుగా తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి గారు తరిగొప్పుల అమరేందర్ ప్రజాపతి గారు టి పి సి సి లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ ఆర్ టి ఐ డిపార్ట్మెంట్ స్టేట్ కన్వీనర్ మరియు బైరమల్ గూడా సాయి నగర్ కాలనీ వాసులు ఇరు ప్రక్కల వారిగా చాలామంది భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారి తమ భక్తి కొద్దీ పసుపు కుంకుమలు చీర సారీలు ఓడి బియ్యం సమర్పించుకొని అమ్మవారి కృపకు పాత్రులు అవుతున్నారు రవిరాజు కాకులారం సురేష్ రెడ్డి కడెం రాఘవేందర్ పల్లె విజయ్ వంశి శ్రీకాంత్ శ్రీహరి దిలీప్ శ్రవణ్ మధు శ్రీకాంత్ స్వామి సందీప్ మహేష్ మనోజ్ వినీత్ వంశీ వర్మ శివ మనీష్ వినోద్ శరత్ కుప్పాల శ్రీధర్ శ్రీకాంత్ గోవింద్ నవ కాంత్ శివప్రసాద్ లోకేష్ వినయ్ రాజేష్ గిరి పోలోజు శివ ప్రకాష్ ఓంకార్ చరణ్ కుప్పాల పవన్ ఆకాష్ పునీత్ హరిచంద్ర రెడ్డి సందీప్ రెడ్డి స్వామి పోలోజ్ కుమారస్వామి మోహన్ నాయక్ సభావాత్ జయమ్మ సుస్మిత రిషిత శ్రావణి వాణి శశిరేఖ స్వప్న సబిత అరుంధతి రుక్మినీ సంధ్య సుజాత కుప్పాల చండీశ్వరి మరియు కాలనీవాసులు బంధుమిత్రులు విజయదశమి పండుగ ప్రాముఖ్యతను చాటుతూ విశిష్టతను తెలియజేస్తున్నారు చిన్నారులు నవదుర్గ మాతల వేషధారణతో శ్రీ శక్తి సామర్థ్యాలను తెలియజేస్తూ మహిషాసుర మర్దిని వద రావణ సంహారం శమీ పూజ ఆయుధ పూజ బొమ్మ ల కొలువు వంటి ఎంతో ఆకర్షనీయంగా జరుపుతుమన సంస్కృతి ఇతిహాసాల గొప్పదనాన్ని ప్రశంసించారు అమ్మవారు శక్తి స్వరూపిణి అని విద్యాసంపదలకు నిలయమని ఆమెను ఆదర్శంగా తీసుకొని ధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలని శక్తి స్వరూపమైన స్త్రీలు మానవుని జీవితంలో అడుగడుగునా ఆసరాగా ఉంటారని అటువంటి ఆడబిడ్డలను గౌరవించడం మన హిందువుల కర్తవ్యం అని ఈ పండుగను ప్రాంతాలవారీగా దసరా బతుకమ్మ రావణ సంహారం మొదలగు పండుగలు విధి విధానాలుగా జరుపుకుంటారని ఆ చల్లని తల్లి కరుణ అందరిపై ఉండాలని అందరికీ మరోసారి దసరా పండుగ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు అన్న ప్రసాదములు స్వీకరించి అందరూ భజనల తో భక్తి పాటలు పాడుచు చాలామంది భక్తులతో ఆహ్లాదకరంగా అంగరంగ వైభవంగా కార్యక్రమంజరిపి అమ్మవారి సేవలో పాల్గొంటూ ప్రతినిత్యం తీర్థప్రసాదాలు స్వీకరిస్తూ ఈ కార్యక్రమం లో అన్నప్రసాదాలు వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందుచున్నారు

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలియజేశారు**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు

(మొదటి తరువాయి)

పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్‌ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగ పడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్‌ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు అన్నారు. నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్‌ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కేంద్రాన్ని మూడేళ్లలో పూర్తి చేసేందుకు కేంద్రం ప్లాన్ రెడీ చేసింది. వెరీ లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడర్ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుకు ఎప్పుడో కేంద్రం ఓకే చెప్పింది. ఇన్ని రోజులకు మంగళవారం భూమిపూజ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల 55 నిముషాలకు భూమిపూజ జరిగింది. దేశంలోనే అతిపెద్ద రెండో వీఎల్‌ఎఫ్ నేవీ రాడార్ సెంటర్‌గా దీన్ని 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్రం సంకల్పించింది. దీని నిర్మాణానికి 2,900 ఎకరాల అటవీ భూమిని ఈస్టర్న్ నావెల్ కమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ భూమి అప్పగింతతో ఇక్కడ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు మార్గం సులభమైంది. ఈ రాడార్‌లో సదుపాయాలు కల్పించేందుకు ఈ అటవీ ప్రాంతం చుట్టూ దాదాపు 24 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తారు. ఇప్పుడు శంకుస్థాపన చేసిన ప్రాంతంలో రాడార్ స్టేషన్‌తోపాటు 2500 మంది నివాసం ఉండేలా టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. అందులో స్కూల్స్, హాస్పిటల్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ దాదాపు 500 మందికిపైగా నేవీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పని చేస్తారు. రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేసిన తర్వాత వికారాబాద్ పూడూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందన్నారు. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది. కొందరు వీఎల్‌ఎఫ్‌ను వివాదం చేస్తున్నారు. వీఎల్‌ఎఫ్‌తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. దేశంలో రెండో వీఎల్‌ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయాల మోసం వివాదం చేసేవారికి కనువిప్పు కలగాలి. 2017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలియజేశారు. 'ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్ నాథ్ సింగ్ అడగ్గానే మేం కొనసాగించాం. దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించా.. పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా... దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం... దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్ ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదు.. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు... దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలి. వీఎల్‌ఎఫ్ ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. రాడార్ ఏర్పాటు ప్రాంతంలో గుడికి వచ్చేందుకు ప్రజలకు అనుమతి ఇవ్వాలని రాజ్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు.

# మహారాష్ట్ర, జార్ఖండ్‌లో మోగిన ఎన్నికల నగారా

(మొదటి తరువాయి)

జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 4వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 25వ తేదీలోగా ఎన్నికలు ముగియాల్సి ఉంటుంది. జార్ఖాడ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా జరగనున్నట్టు సీఈసీ ప్రకటించారు. తొలి విడత నవంబర్ 13, రెండో విడత నవంబర్ 20న జరుగుతుంది. తొలి విడత ఎన్నికలకు అక్టోబర్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. అక్టోబర్ 25తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 28న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 30తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తొలి విడతలో భాగంగా 43 నియోజకవర్గాలకు నవంబర్ 13న పోలింగ్ జరుగుతుంది. రెండో విడత నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. అక్టోబర్ 29తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 1వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగుస్తోంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 81 స్థానాలున్న జార్ఖాండ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగుస్తుంది. మహారాష్ట్రలో బిజేపీ, శివసేన, ఎన్‌సీపీతో కూడిన మహాకూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, జార్ఖాండ్‌లో జెఎంఎం అధికారంలో ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల తేదీని కూడా ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రకటించింది. నవంబర్ 13న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కూడా ఇదే రోజు ప్రకటిస్తారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరగనున్న 9 అసెంబ్లీ స్థానాల్లో మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, ఖైర్, కర్హాల్, సిషామౌ, ఫూల్పూర్, కతెహారి, మజవాన్ ఉన్నాయి. వీటిలో నాలుగు స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకోగా, బీజేపీ 3, రాష్ట్రీయ లోక్‌దళ, నిషద్ పార్టీ చెరో స్థానం గెలుచుకున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన ఆయా పార్టీల నేతలు తాము గెలిచిన అసెంబ్లీ స్థానాలను వదులుకోవడంతో యూపీలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యూపీలో ఎదురుదెబ్బ తగలడంతో ఈ అసెంబ్లీ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు గట్టి సవాలనే చెప్పాలి.

## మెస్‌చార్జీల పెంపుపై కసరత్తు పూర్తి చేయండి

(మొదటి తరువాయి)

అన్నారు. మంగళవారం గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బోధన జరుగుతున్న తీరుపై నిపుణులతో పర్యవేక్షణ జరిపించి ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇప్పించాలని కోరారు. విద్యార్థుల మెస్, కాస్మోటిక్స్ బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని వివరించారు. అధికారులు ఈ విషయాలకే పరిమితం కాకుండా బోధనలో నాణ్యతను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్ (టీఎల్‌ఎం) వినియోగం పెంచాలనీ, కంప్యూటర్లు, సైన్స్ ఇతర ల్యాబ్‌ల వినియోగాన్ని విస్తృతం చేయాలని కోరారు. గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాలనీ, ప్రతిరోజూ ఒక పాఠశాలను సందర్శించాలని సూచించారు. వెళ్లామా, వచ్చామా అన్న పద్ధతిలో కాకుండా సగం పూట అక్కడే ఉండి అన్ని రకాల విషయాలను సమీక్షించాలని ఆదేశించారు. నెలాఖరులోగా కార్యదర్శులు ఎన్ని విద్యాసంస్థలను సందర్శించారు, ఏ ఏ అంశాలను గమనించారు, ఏ చర్యలు చేపట్టారు అనే విషయాలపై నివేదిక ఇవ్వాలని కోరారు.

## ఢిల్లీ-షికాగో విమానానికి బాంబు బెదరింపు

(మొదటి తరువాయి)

ఎయిరిండియా విమానం ఏఐ127 మంగళవారం ఢిల్లీ నుంచి బయలుదేరింది. ఈ క్రమంలోనే విమానానికి భద్రతా ముప్పు పొంచి ఉందంటూ ఆన్‌లైన్‌లో ఓ పోస్టు కనిపించింది. ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని కెనడాలోని ఇకాలూట్ ఎయిర్‌పోర్టుకు మళ్లించినట్లు ఎయిరిండియా పేర్కొంది. భద్రతా నిబంధనల ప్రకారం విమానంతోపాటు ప్రయాణికులందరినీ క్షుణ్నంగా తనిఖీ చేస్తామని తెలిపింది. ఈ పక్రియ పూర్తయ్యే వరకు ప్రయాణికులకు సహాయం చేసేందుకు అక్కడి ఎయిర్‌పోర్టు విభాగాలన్నింటినీ అప్రమత్తం చేశామని, అనంతరం తిరిగి వారి ప్రయాణం కొనసాగుతుందని ఎయిరిండియా ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి బయలుదేరిన ఈ విమానం అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 7గంటలకు షికాగో చేరుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్ ట్రాకింగ్ ప్రకారం ప్రస్తుతం ఆ విమానం ఇంకా కెనడాలోని ఎయిర్‌పోర్టులోనే ఉన్నట్లు సమాచారం.

## విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారు

(మొదటి తరువాయి)

ఇవ్వని సర్కారు మూసీ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధికంగా మూసేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు మంత్రి లేరనీ, వారి సమస్యలను వినే ఓపిక సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్‌ఎస్ సహించేది లేదని హెచ్చరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గురుకులాలను, ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రయివేటు కాలేజీలకు బకాయిలు చెల్లించకుండా అవి మూసేసే పరిస్థితిని రేవంత్ సర్కార్ తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీ యాజమాన్యాలు ముందే హెచ్చరించినా ప్రభుత్వం తోలుమందంగా వ్యవహరించిందని కేటీఆర్ మండిపడ్డారు. పేరుకుపోయిన బకాయిల కారణంగా చదువులు పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీ యాజమాన్యాల నుంచి సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు రోడ్లపై ధర్నాలు చేస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం వద్ద పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువు కొనసాగించేందుకు అయ్యే డబ్బు లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో అంతకు ముందు ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ. 2 వేల కోట్ల ఫీజు బకాయిలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెల్లించిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సర్కారుకు పాలనానుభవం లేదనీ, పేద ప్రజల బాధలు తెలియవని విమర్శించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా విద్యార్థులతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు

(మొదటి తరువాయి)

మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్‌లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే పక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్‌లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్‌లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్‌లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్‌ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్‌లు ప్రదర్శించారు.

## గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

(మొదటి తరువాయి)

పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్ల పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్‌సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

## వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ

(మొదటి తరువాయి)

ఈ విషయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడిం చారు. కాంగ్రెస్ తాజా నిర్ణయంతో ప్రియాంకా గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగుతున్నట్లైంది. లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి గెలిచిన రాహుల్.. కీలకమైన ఉత్తర్ ప్రదేశ్‌లోని రారుబరేలీలోనే కొనసాగాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేరళలోని వయనాడ్‌ను వదులుకోవడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఇక్కడి నుంచి ప్రియాంకా గాంధీని పోటీ చేయించాలని ఖర్గే నివాసంలో జులైలో జరిగిన సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. వయనాడ్ నుంచి ప్రియాంక ఎన్నికైతే తొలిసారిగా ఆమె పార్లమెంటులో అడుగుపెడతారు. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 15 రాష్ట్రాల్లో రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలకు ఈసీ మంగళవారం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కేరళకు సంబంధించి తమ అభ్యర్థులను ప్రకటించింది. వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న పోలింగ్ జరగనుంది.

## రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి

(మొదటి తరువాయి)

రెడ్డి పేర్కొన్నారు. దేశంలో అతిపెద్ద రాడార్ స్టేషన్ గా పూడూరు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రం నిలుస్తుందని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లా పూడురు మండలంలో భారత నేవీ ఏర్పాటు చేస్తోన్న రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాడార్ స్టేషన్ కు భూమిపూజ చేసిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామ్యం కీలకమన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌కు సిఎం రేవంత్ ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ దేశ రక్షణకు సంబంధించి కీలకమైన నగరం. తెలంగాణకు మూడు వైపులా సముద్రం ఉంది. ఇక్కడ వీఎల్‌ఎఫ్ నిర్మాణంతో సముద్ర ప్రాంతం నుంచి చొరబడే ముష్కరుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ స్టేషన్ తో అనర్థాలు జరుగుతాయని కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేశారు. కానీ తమిళనాడులో 34 ఏళ్లుగా ఉంది. అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దేశ రక్షణ కోసం రాజీపడొద్దనే ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం. కేంద్రంతో కలిసి నడుస్తాం. దేశ రక్షణ కోసం పెడుతున్న ప్రాజెక్టులపై రాజకీయం చేసేవారు పునరాలోచించుకోవాలి . రాడార్ స్టేషన్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుంది. దేశభద్రత చాలా ముఖ్యం. రాడార్ స్టేషన్ పై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. దేశ రక్షణకు సంబంధించిన విషయాన్ని కూడా రాజకీయం చేయడం తగదు. బీఆర్‌ఎస్ పదేళ్లు అబద్దాలు చెప్పింది. ఇప్పుడు దేశ రక్షణకు సంబంధించిన అంశంలో కూడా బీఆర్‌ఎస్ నేతలు అవే అబద్దాలు చెబుతున్నారని సీఎం రేవంత్ విమర్శించారు.

# విశేష భాగ్య దాయిని కోజాగరి పౌర్ణమి

ప్రజా స్వేచ్ఛ

అశ్వనీ నక్షత్రానికి చంద్రుడు మిక్కిలి దగ్గరగా ఉండే రోజు ఆశ్వయుజ శుద్ధ పూర్ణిమ విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. లక్ష్మీ దేవికి, శ్రీరామునికి ప్రియమైనదై, ఆశ్వయుజ మాస వ్రతాలలో విశేష భాగ్యదాయిని అయిన కోజాగరీ వ్రతాన్ని దసరా తర్వాత వచ్చే పౌర్ణమినాడు జరుపుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం.హిందువులు పూజించే స్త్రీ దేవతలలో లక్ష్మీదేవిని తొలుత పేర్కొంటారు. భారతీయులచే నిత్య పూజ లందుకునే లక్ష్మీదేవి పేరున ఒక వారము పిలుబడగా, ఏడాదికి ఒకసారి వచ్చే కోజాగరి పూర్ణిమ రోజున విష్ణుపత్నికి విశేష అర్చనలు చేయడం సనాతన ఆచారం. క్షీర సాగరంలో జన్మించిన లక్ష్మీదేవిని విష్ణుమూర్తి భార్యగా స్వీకరించగా, విష్ణువును పురుషునిగా, లక్ష్మిని ప్రకృతిగా భావించి పూజిస్తారు. ఆశ్వయుజ పూర్ణిమ నాడు లక్ష్మీదేవి భూమి అంతా కలయ తిరుగుతూ ప్రతి ఇంటి వద్ద నిలిచి, అర్ధరాత్రి ఎవరు మేలుకుని ఉన్నారని అడుగు తుందిట. ఎవరూ పలకక పోతే వెళ్ళి పోతుందని పురాణ కథనం. అందులకే రాత్రంతా జాగరణ చేస్తూ, క్షీరాభిజాత యైన లక్ష్మికి ప్రీతి పాత్రమైన పంచదార, ఏలక పొడి, కుంకుమ పువ్వు వేసి క్షీరాన్నం వండి, లక్ష్మీ దేవతకు వెన్నెలలో ఉంచి నివేదిస్తారు. ఇలా ఉంచడం వల్ల చంద్ర కిరణాల ద్వారా వచ్చిన అమృతం అందులో పడుతుందని విశ్వాసం. ఆహ్వానించిన అతిథులకు



బంధు మిత్రులకు పాలు పంచుతారు. ఇలా లక్ష్మీదే విని అర్చించి, జాగరణ చేస్తే లక్ష్మీదేవి కటాక్షాన్ని పొందుతారని నమ్మకం. ఈ దినం నాడు చుట్టాలతో స్నేహితులతో రాత్రి యక్షక్రీడ ఆడుతూ, అర్ధరాత్రివరకు మేలుకొని ఉండడం పుణ్యప్రదమని శాస్త్ర వచనం. దీనిని భాగ్యవర్తకంగా భావిస్తారు. ఆశ్వయుజ మాసంలో విశేష పుణ్యాన్ని కలిగించే వ్రతం ఏదని వాలఖిల్య రుషిని, రుషులు ప్రశ్నించగా, "కోజాగరీ" వ్రతమని పేర్కొన్నట్లు కథనం. మగధ దేశ విప్రుడైన వలితుడు, భార్య చండిని సంపద కోసం పెట్టే బాధలు భరించ లేక, ఇల్లు వదిలి అడవి బాట పట్టాడు. అలా వెళుతుండగా, నదీతీరాన రాత్రి ముగ్గురు నాగకన్యలు వచ్చి, లక్ష్మీ పూజ చేసి, యక్షక్రీడ ఆడేందుకు గాను నాలుగవ మనిషి కోసం వెతకగా, వలితుడు కన్పిస్తాడు. వారు ఆయ నను యక్షక్రీడకు రమ్మని పిలుస్తారు. దానివల్ల భాగ్యం కలుగలదని చెపుతారు. జూదం వ్యవసమని వలితుడు చెప్పగా, ఆనాడు యక్షక్రీడకు శాస్త్రీయమైన అనుమతి ఉందని, ఒప్పించి, ఆట ప్రారంభిస్తారు వలితుడు మూడు సార్లు ఓడి, ఉన్నదంతా పోగొట్టు కోగా, పంచె, కౌపీనం, యజ్ఞోపవీతం మాత్రమే మిగు లుతాయి. అర్ధరాత్రి లక్ష్మీ నారాయణులు భూలోక సంచారం చేస్తూ, నిద్రపోకుండా ఉన్న పేద బ్రాహ్మ ణుని, నాగకన్యలను గాంచి, సదరు బ్రాహ్మణుని వివాహ మాడాలని వారికి చెపుతారు. తమతో జూదంలో గెలిస్తే, అట్లేయని వారు అంగీకరించగా, ఆ ద్విజుడు ద్విగుణీకృత ఉత్సాహ వంతుడై, విజయుడవుతాడు. వారిని గాంధర్వ వివాహమాడి, నాగకన్యలతో, భాగ్యవంతుడై ఇంటికి తరలగా, చండిని స్వాగతించగా, చీకుచింతా రహితులవుతారు. కోజాగిరి పూర్ణిమ నాడు ద్వార బంధాల ముంగిళ్ళలో గోడల మీద లక్ష్మీదేవి పాద చిహ్నాలు, వరి, శంఖాల, పైడికంటి పిట్టల, ఆకుల బొమ్మలను వేసే పద్ధతి మహారాష్ట్రలో ఉంది. అలంకృత గృహాలలో గవ్వలు లేదా పాచికలు ఆడుతూ మేలుకొని ఉండడం సర్వత్రా ఆచరణలో ఉంది. అలాగే తొలి చూలు బిడ్డకు తల్లి కొత్త బట్టలు వేసి, అక్షతలు చల్లి దీర్ఘాయురస్తు అని దీవించడం, దేవ వైద్యులైన అశ్వినీ దేవతల రక్షణలో తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని చేసే పర్వం కొన్ని చోట్ల పాటిస్తారు.

## అందోజు సత్యం చారిని సన్మానించిన తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం హస్తినాపురం డివిజన్ సభ్యులు



మహేశ్వరం నియోజకవర్గం ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం హస్తినాపురం డివిజన్ ఆధ్వర్యంలో హస్తినాపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు మరియు ఎల్బీనగర్ నియోజకవర్గంవిశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు అందోజు సత్యం జన్మదిన సందర్భంగా మంగళవారం ఆయనను కలిసి సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు పసూనూరి పాండురంగా చారి, ప్రధాన కార్యదర్శి మల్లోజు శివప్రసాద్ చారి, కోశాధికారి మల్లోజు శ్రీనివాస్ చారి, సంఘటిత కార్యదర్శి పసునూరి చంద్రమౌళి చారి, ఉపాధ్యక్షులు రామాచారి, గౌరవ సలహాదారులు కాసోజు నరసింహా చారి మరియు బొడ్డుపల్లి వెంకటరమణ చారి, గౌరవ సభ్యులు అందోజు సురేంద్ర చారి మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు..

-సిఐ కన్నపరాజు



ఎటపాక: ప్రజా స్వేచ్ఛ

మండల పరిధిలోని గుండాల గ్రామంలోని ఇసుక రిచ్ నుండి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎటపాక సిఐ కన్నప రాజు,ఎస్సై పార్థసారథి హెచ్చరించారు.మంగళవారం గుండాల ఇసుక రిచ్ ను సిఐ కన్నప రాజు,ఎస్సై పార్థసారథి సిబ్బంది తో ఆకస్మిక తనిఖీ చేపట్టారు.ఎంతటివారైనా ఇసుక అక్రమంగా రవాణా కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాము అని అన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నారని ఇసుక కావాల్సిన లబ్ధిదారులు ఆన్ లైన్ లో నమోదు చేసుకొని ఇసుక రవాణా చేసుకో వచ్చు అని అన్నారు.ఈ తనిఖీల్లో .ఆర్ ఐ బాపిరాజు రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి ప్రదాతకు ఆత్మీయంగా దసరా శుభాకాంక్షలు...

కుత్బుల్లాపూర్ ప్రజా స్వేచ్ఛ



కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా అని, ప్రజలందరికీ జీవితాల్లో కూడా చీకటి రోజులు తొలగి సుఖ సంతోషాలతో జీవించాలన్నారు.



కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ


పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సూచించారు. దసరా దీపావళి పండుగ పురస్కరించుకొని పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ మరియు మహిళా అధ్యక్షురాలు బాలానగర్లోని పార్టీ కార్యాలయానికి తరలివచ్చి రమేష్ కి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని తగిన పదవులు కల్పిస్తుందని పేర్కొన్నారు.

## పోషకాహార లోపం వ్యాధులకు మూలం

ప్రజా స్వేచ్ఛ




ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహరం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. 1945 అక్టోబర్ 16న ఐరాస ఆహార మరియు వ్యవసాయక సంస్థ స్థాపించ బడింది. అయితే ఈ కార్యక్రమాన్ని మొదటిసారి 1981లో జరుపు కున్నారు. ఈ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే ఆహారాన్ని వృధా చేయరాదు. ప్రజల్లో ఈ విషయంలో చైతన్యం నింపాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 1945 అక్టోబర్ 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ' ను ప్రారంభించారు. ఈ సంస్థను ఆంగ్లంలో %ఖీూూ% అంటారు. అంటే ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్. ఈ సంస్థ గౌరవార్థం ఈ సంస్థ ఏర్పడిన అక్టోబరు 16 తేదిని ప్రపంచ ఆహార దినోత్సవంగా నిర్ణయించారు. అప్పటి నుంచి ఇదే రోజున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి.భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో




విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

## శివారు మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి పరుస్తా

**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**-కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్ ప్రజా స్వేచ్ఛ
కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో దాదాపు 2 కోట్ల 26 లక్షల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు, వీధిదీపాలు, ఓపెన్ జిమ్ వంటి పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా అపర్ణ పామ్ మెడోస్, మొదటి వార్డు ప్లాట్ నెంబర్ 90 వద్ద 98 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు, 10 లక్షల రూపాయలతో ఒకటవ వార్డులో ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు, 70 లక్షల రూపాయలతో నూజివీడు మరియు ఐదవ వార్డులో ఏర్పాటు చేయనున్న వీధి దీపాలు, దాదాపు 25 లక్షల రూపాయలతో ఏడవ వార్డులో చేపట్టనున్న సిసి రోడ్డు పనులు, ఎనిమిదవ వార్డులో 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు సమీపంలో 49 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన నిర్వహించారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని రానున్న రోజుల్లో శివారు మున్సిపాలిటీలను మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి పరుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్లు శంభీ పూర్ కృష్ణ, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, చింతల రవీందర్ యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా గణేష్




శేరిలింగంపల్లి ప్రజా స్వేచ్ఛ
సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ఎమ్మెల్యే గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థానిక శాసనసభ సభ్యులు పి ఏ సి చైర్మన్ అరికెపుడి గాంధీ జన్మది సందర్బంగా గాంధీ తోపాటు కొండగట్టు అభయ ఆంజనేయ స్వామి దర్శించు తదనంతరం ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తోపాటు డివిజన్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెల్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు బోయ కిషన్, జిల్లా వెంకటేష్,భాస్కర్ రెడ్డి,మహేష్, లాలన్, సాయి, కార్తిక్,తోపాటు డివిజన్ నాయకు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి 2024 కళా ఉత్సవాలు ప్రారంభం

వనపర్తి ప్రజా స్వేచ్ఛ
నేటి నుంచి పాఠశాల విద్య - కళా ఉత్సవాలు 2024 సంవత్సరానికి సంబంధించిన ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు వనపర్తి జిల్లా విద్యాశాఖాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్య - కళా ఉత్సవ 2024 జిల్లా స్థాయి ప్రదర్శన గురించి,డైరెక్టర్ ఆఫ్ సెక్రెటరీ తెలంగాణ, హైదరాబాద్ వారి ఆదేశానుసారం ఈకార్యక్రమాలు జిల్లాలోని సంబందిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అనగా ప్రభుత్వ, ప్రైవేటు, జడ్.పి.హెచ్.ఎస్, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అందరూ విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన తెలిపారు.ఈ ఉత్సవాలు 16.10.2024 మరియు 17.10.2024 వరకు రెండు రోజులు నిర్వహించబడతాయి, ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ఉదయం గం. 10.00 లోపు బాలభవన్ వనపర్తి కి చేరుకోవాలని అన్నారు.కళా ఉత్సవంలో నిర్వహించే కార్యక్రమాలు (1) వొకల్ మ్యూజిక్ 2) ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ 3) డాన్స్ 4) థియేటర్ 5) విసుఅల్ ఆర్ట్స్ 6) ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు ఇతర వివరాలకు మహానంది, కో- ఆర్డినేటర్ సెల్ నెం. 9966070911 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన అన్నారు.

## వైద్య శాస్త్రంలో అద్భుతం అనస్థీషియా ఆవిష్కరణ




ప్రజా స్వేచ్ఛ
ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం (WFSA) ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి. పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు.భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు. అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫ్యూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు.1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి.ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి.ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు.సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది.బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను నిరంతరం పర్యవేక్షించడానికి సాయం చేస్తున్నాయి.రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవించి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటిల్లో ముఖ్య భూమిక పోషించడం

## మిస్టర్ ఆసియా బిరుదు పొందిన తొలి తెలుగు వాడు దండమూడి

ప్రజా స్వేచ్ఛ
దండమూడి రాజగోపాలరావు (అక్టోబరు 16, 1916 – ఆగష్టు 6, 1981) భారత దేశ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు. అసమాన బలశాలి, అసాధారణ శక్తి సంపన్నుడు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఆయన 'ఆంధ్రభీమ, ఇండియన్ టార్జాన్', ఇండియన్ హెర్క్యులస్, జాయింట్ ఆఫ్ ఇండియన్ బిరుదులను పొందారు.శరీర సౌష్టవ పోటీలో మిస్టర్ ఆసియా బిరుదును పొందిన తొలి ఆంధ్రుడే కాక తొలి భారతీయుడు. కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని గండిగుంటలో 1916 అక్టోబర్ 14న రైతు కుటుంబంలో జన్మించిన ఆయన కోడి రామ్మూర్తి నాయుని స్ఫూర్తితో బరువులు ఎత్తడంపై ఆసక్తి కలిగి, పెదపారుపూడి మండలం వాన పాములలో వెయిట్‌లిఫ్టింగ్ సాధన ప్రారంభించారు. 1938లో తొలిసారిగా పోటీల్లో పాల్గొని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ 1940లో మొదటిసారిగా రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా గెలుపొందారు. 1943 లండన్ ఒలింపిక్స్ ఆదిగా ... మూడు పర్యాయాలు దేశం పక్షాన విశ్వ క్రీడలకు ప్రాతినిధ్యం వహించారు. 1945లో జాతీయ స్థాయిలో 320 పౌండ్ల బరువు ఎత్తి విజేతగా నిలిచారు. 1948లో కోల్‌కతా వేదికగా



జరిగిన ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని... 'మిస్టర్ ఆసియా'గా గుర్తింపు పొందిన తొలి భారతీయుడు, అదీ తెలుగు వారు కావడం విశేషం. అలా 1948లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో పాల్గొన్న తొలి ఆంధ్రుడుగా నిలిచారు.1945 నుంచి 1958 వరకు 13 ఏళ్లపాటు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌గా గెలుపొందుతూ వచ్చారు.ఆయన 1951లో ఢిల్లీలో జరిగిన ప్రథమ ఆసియా క్రీడోత్సవాలలో వెయిట్ లిఫ్టింగ్ పురుషుల సూపర్ హెవీ వెయిట్ (ం105 కేజీలు) వర్గములో కాంస్య పతకాన్ని గెలుచు కున్నారు. రాజగోపాలరావు అనేక రాష్ట్రాలు, దేశాలలో ప్రదర్శనలిచ్చారు. తెలుగు రంగస్థల, సినిమా నటుడుగా 1963లో విడుదలైన నర్తనశాల సినిమాలోనూ, 1965లో విడుదలైన వీరాభిమన్యు సినిమాలోనూ, భీముని పాత్ర సమర్థ వంతంగా పోషించారు.రాష్ట్ర ఒలింపిక్ సంఘం వ్యవస్థాపకుడిగా, వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చాలా ఏళ్లపాటు ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. విజయవాడలో సొంతంగా వ్యాయామశాల నెలకొల్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జిమ్‌ల ఏర్పాటుకు కృషి చేశారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో స్థలం విరాళంగా ఇచ్చి... ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కారకులయ్యారు. ఆయన పేరు మీద ఉన్న ఇండోర్ క్రీడా ప్రాంగణానికి "దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం" అని నామకరణం చేశారు. దాన్ని నాట రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ప్రారంభించారు. రాజగోపాలరావు 1981, ఆగష్టు 6న మరణించారు.

## సంక్షేమ అధికారిని కలిసిన ఆశ్రిత బృందం

నల్లగొండ ప్రజా స్వేచ్ఛ
జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణవేణి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆశ్రీత సంస్థ బృందం. జిల్లాలో ఆశ్రీత సంస్థ ద్వారా బాల్యవివాహాలు, బాలకార్మికులు, బాలల అక్రమ రవాణ, బాలలపై జరుగుతున్న సెక్సువల్ అబ్యూసెస్, అంశాలపైన సంస్థ చేస్తున్న కార్యక్రమాలు వివరించడం జరిగింది. సంస్థ చేస్తున్న కార్యక్రమాలకి డిపార్ట్మెంట్ సహకారం కావాలని కోరడం జరిగింది. అందుకు మేడం తప్పకుండ మా సహకారం ఉంటుందని చెప్పారు.



జిల్లాలో పని చేసే స్వచ్ఛంధ సంస్థలకు శాఖ తరుపున సహాయ సహకారాలు అందిస్తామని, అదేవిదంగా జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలన కొరకు ఎవరూ కూడ పని చేయటం లేదని ఆశ్రీత సంస్థ పని చేయటం అందుకు తప్పకుండ కలిసి పని చేద్దామని చెప్పారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన పై సంస్థ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో. ఆర్డినేటర్ యం శోభారాణి, కార్యకర్తలు ఝాన్సీ, ధనమ్మ, కవిత, చిన్న రాయుడు పాల్గొన్నారు.

# ఇది శిక్షా కాలం కాదు శిక్షణా కాలం

**-మంచి లక్షణాలతో బయటకు వెళ్ళాలి**
**-జ్యువైనల్ హోమ్‌లో విద్యార్థులతో సీతక్క మాటాముచ్చట**
**-వారితో కలిసి భోజనం**
**-విలువిద్యను చూసి ఆశ్చర్యపోయిన మంత్రి**



ప్రజా స్వేచ్ఛ-హైదరాబాద్
జ్యువైనల్ హోమ్ అంటేనే పరివర్తన కేంద్రమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. తెలిసీతెలియని వయస్సులో చేసిన తప్పులతో వచ్చిన 72 మంది చిన్నారులు ఇక్కడ బాలనేరస్తులుగా ఉన్నారనీ, ఇది శిక్షా కాలంగా కాకుండా శిక్షణా కాలంగా భావించి జీవితంలో ఎదగడానికి తమను తాము తీర్చుదిద్దుకోవాలని పిల్లలకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని స్టేట్ జ్యువైనల్ హోమ్‌ను మంత్రి సీతక్క సందర్శించారు. పిల్లలు ప్రదర్శించిన విలువిద్యను చూసి మంత్రముగ్ధులయ్యారు. వారితో కలిసిపోయి తానూ బాణాలు సంధించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. నూతన వస్త్రాలను అందజేశారు. హోమ్‌లోని బాలనేరస్తులు తాము తయారు చేసిన బెడ్‌షీట్లు, కార్పెట్లు, ఇతర వస్తువులను సీతక్కకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బందారు శోభారాణి, తదితరులు పాల్గొన్నారు. పిల్లలనుద్దేశించి సీతక్క మాట్లాడుతూ.. ఇక్కడ నుంచి మంచి లక్షణాలు అలవర్చుకుని బయటకు వెళ్లాలని సూచించారు. అందరూ త్వరగా అమ్మానాన్నల చెంతకు చేరుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ హోమ్‌లో మానసికంగా బలోపేతమవుతూ మంచి పౌరులుగా ఎదిగి పేరుతెచ్చుకోవాలని దీవించారు. పిల్లలు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. మానవతా దృక్పథంతో హోమ్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. సొంతపిల్లల్లాగా భావించి వారి ఎదుగుదలకు సహకరించాలని కోరారు. త్వరలో ఇక్కడ గ్రంథాలయం, యోగ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. హోమ్‌లో పిల్లలకు కావాల్సిన విద్యను అందిస్తున్నామనీ, వృత్తిపరమైన కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. టాటా టెక్నికల్ సపోర్ట్‌తో సాంకేతిక పరిజ్ఞానం నేర్పిస్తున్నామని చెప్పారు. విలువిద్యలో నేషనల్ గేమ్స్ వరకు విద్యార్థులు వెళ్లడం అభినందించాల్సిన విషయమన్నారు. బాలనేరస్తుల్లో సత్ప్రవర్తన తీసుకొచ్చి త్వరలోనే ఇంటికి పంపిస్తామన్నారు. భావించి వారి ఎదుగుదలకు సహకరించాలని కోరారు. త్వరలో ఇక్కడ గ్రంథాలయం, యోగ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. హోమ్‌లో పిల్లలకు కావాల్సిన విద్యను అందిస్తున్నామనీ, వృత్తిపరమైన కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. టాటా టెక్నికల్ సపోర్ట్‌తో సాంకేతిక పరిజ్ఞానం నేర్పిస్తున్నామని చెప్పారు. విలువిద్యలో నేషనల్ గేమ్స్ వరకు విద్యార్థులు వెళ్లడం అభినందించాల్సిన విషయమన్నారు. బాలనేరస్తుల్లో సత్ప్రవర్తన తీసుకొచ్చి త్వరలోనే ఇంటికి పంపిస్తామన్నారు.

## ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



గూడూరు ప్రజా స్వేచ్ఛ
గూడూరు మండల కేంద్రంలో ఆరోగ్యమే మహాభాగ్యం అని నినాదంతో స్థాపితమైనటువంటి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు మహమ్మద్ ఖాసిం అధ్యక్షులు భూక్య బాలునాయక్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయ సాధన కోసం మన వంతు మనం ఎంతో కొంత పాత్ర పోషించవలసి ఉంటుందని అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడుచుకుంటూ మన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మండల కేంద్రంలో ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి మన వంతు మన పాత్ర పోషించాలని అన్నారు. ఉపాధ్యక్షులు బానోతు లక్ష్మణ్ నాయక్ ప్రధాన కార్యదర్శి పెనుక ప్రభాకర్ ట్రెజరర్ బత్తుల శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణ సీనియర్ వాకర్స్ స్వామి మరియు ప్రచార కార్యదర్శి వాంకుడోత్ గోపీనాథ్ మాట్లాడుతూ పేపర్ బాయ్ నుండి ప్రపంచానికి భారత దేశ పేరును వ్యాపింపచేసిన మిస్సైల్ మ్యాన్ మాజీ రాష్ట్రపతి టీచర్ భారత్ రత్న అవార్డు గ్రహీత పేరు మన వాకర్స్ అసోసియేషన్ పేరు పెట్టుకోవడం ఎంతో గర్వంగా ఉందని ప్రతిరోజు ఇంత గొప్ప వ్యక్తిని మనం తలుచుకుంటూ మన ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామని ఇతని ఆదర్శంగా తీసుకొని మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని అంటూ జయంతిని ఘనంగా నిర్వహించారు.. వాకర్స్ అందరూ కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేసి అబ్దుల్ కలామ్ ని స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో ముయ్యబోయిన వెంకన్న నూనావత్ వీరన్న వాంకుడోత్ కొమ్మాలు , బాబు రవి మహేష్ భూపతి శ్రీను ,బట్టు సారయ్య, లక్ష్మయ్య మల్లేష్ వెంకన్న అందరూ వాకర్స్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# పారిశ్రామికవేత్తల సమస్యలు పరిష్కరిస్తాం

**-ఐసీసీ బిజినెస్ మీట్‌లో పరిశ్రమలశాఖ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్‌రెడ్డి**




ప్రజా స్వేచ్ఛ-హైదరాబాద్‌బ్యూరో
రాష్ట్రంలో కొత్త పరిశ్రమల్ని ఆహ్వానిస్తూనే, ఇప్పుడున్న పరిశ్రమల సమస్యల్ని పరిష్కరిస్తామని పరిశ్రమలశాఖ స్పెషల్ సెక్రటరీ ఈ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో మంగళవారంనాడిక్కడి ఓ హోటల్‌లో జరిగిన బిజినెస్ మీట్ హైదరాబాద్-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పాటైన స్కిల్ యూనివర్సిటీ ద్వారా మొదటి సంవత్సరం దాదాపు పదివేల మంది నిపుణులు తయారవుతారనీ, వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పారిశ్రామికవేత్తలదేనని చెప్పారు. పరిశ్రమల్ని ప్రోత్సహిస్తూ, యువతకు ఉపాధి కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నదని తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు విద్యాశాఖ అనుసంధానంతో స్కిల్ యూనివర్సిటీ పనిచేస్తుందనీ, పారిశ్రామిక అవసరాలు, డిమాండ్‌ను బట్టి నిపుణుల తయారీ జరుగుతుందని స్పష్టం చేశారు. ఐటీ సెక్టార్ వికేంద్రీకరణ జరుగుతుందనీ, జిల్లాలకు వాటిని విస్తరిస్తామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్‌రోడ్ మధ్య తొలి ఏడాదిలో పది ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామనీ, వాటిలో మహిళల కోసం ప్రత్యేక పార్కు ఉంటుందని వివరించారు. పారిశ్రామికవేత్తల ప్రోత్సాహకాలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటికోసం బడ్జెట్ కేటాయింపులు జరిగాయనీ, వాటి విడుదలపై ప్రభుత్వం త్వరలో ప్రకటన చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పారిశ్రామిక పాలసీలో మరికొన్ని క్లాజులు చేర్చే అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైనర్స్ (ఎఫ్ఎస్ఎమ్ఈ) జాతీయ అధ్యక్షులు ఏపీకే రెడ్డి మాట్లాడుతూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కుల ఏర్పాటుకు తాము తోడ్పాటు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు రూ. 4,400 కోట్ల ప్రోత్సాహకాల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదనీ, వీటిని ఆయా పరిశ్రమల వివిధ పద్దుల కింద బుక్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక పాలసీకి బడ్జెట్ కేటాయింపులు చేస్తే, దాని అమలుపై పారిశ్రామికవేత్తల్లో భరోసా వస్తుందని అన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఇండిస్ట్రియల్ పార్కుల (ఐలా)కు ఓఆర్ఆర్, ట్రిబుల్ ఆర్ మధ్య ఏర్పాటయ్యే పారిశ్రామిక పార్కుల్లో ఐదు శాతం కన్వర్షన్ కల్పించాలని కోరారు. ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలనీ, దానివల్ల రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. ఐసీసీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శాఖల చైర్మెన్ రఘునాథన్ కన్నన్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పారిశ్రామికాభివృద్ధి, విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఐసీసీ అధ్యక్షులు అమేయప్రభు తమ సంస్థ లక్ష్యాలు, పురోగతి ప్రణాళికలు, పారిశ్రామిక అవకాశాలను వివరించారు. అనంతరం కేంద్ర ఫారిన్ ట్రేడ్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌బెల్ పలువురు పారిశ్రామికవేత్తలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో ఐసీసీ కో చైర్మెన్ వినీత్ టిబ్రేవాల్, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హెడ్ నవీన్ మేడిశెట్టి, ఐసీసీ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులకు కొడాల ఆర్థిక సహాయం



ప్రజా స్వేచ్ఛ మర్రిగూడ
దసరా పండుగ రోజు రోడ్డు ప్రమాదంలో మరణించిన కోండూరు ఫీల్డ్ అసిస్టెంట్ జరుపుల బిచ్య నాయక్ కుటుంబ సభ్యులను మంగళవారం కోడలా ఆల్వాల్ రెడ్డి అన్న గారు పరామర్శించారూ. వారి కుటుంబ సభ్యులకు 10000=00 (పదివేల రూపాయలు) ఆర్థిక సహాయం వారి వెంట సైదులు, ఈద కృష్ణ, ప్రదీప్ రెడ్డి, శ్రీశైలం, సురేష్, కొండల్, మంగ్త, బాలు, పరమేష్ తదితరులు ఉన్నారు.

---



శేరిలింగంపల్లి ప్రజా స్వేచ్ఛ
PACచైర్మన్ , శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ జన్మదినం ను పురస్కరించుకుని కొండగట్టులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం లో ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు గచ్చిబౌలి డివిజన్ నాయకులు, కార్యకర్తల తో కలిసి కేక్ కట్ చేసి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేయడం జరిగినది ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయబిలాషులు తదితరులు పాల్గొన్నారు

# సల్మాన్ ఖాన్‌కి వై-ప్లస్ భద్రత..



ప్రజా స్వేచ్ఛ
బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌కు షాక్ తగిలింది. నటుడికి అత్యంత సన్నిత సంబంధాలున్న బాబా సిద్ధిఖీని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ లక్ష్యంగా చేసుకొని ఈ నెల 12న కాల్చి చంపింది. ఆ తర్వాత సల్మాన్ గెలాక్సీ అపార్ట్‌మెంట్ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. అక్కడ ఎవరూ సెల్ఫీలు, వీడియోలు తీసుకోకుండా పోలీసులు నిషేధం విధించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పోలీసులు చుట్టుముట్టారు. మీడియా సిబ్బందిని అనుమతించడం లేదు. మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య నేపథ్యంలో సల్మాన్ ఖాన్‌కు అదనపు భద్రతను భారీగా పెంచారు. సల్మాన్ ఖాన్ భద్రతను వై ప్లస్‌కి అప్‌డేట్ చేశారు. ఎస్కార్ట్ వాహనం కూడా ఏర్పాటు చేశారు. అలాగే, శిక్షణ పొందిన సాయుధ కానిస్టేబుల్ సైతం వెంట వెళ్లనున్నాడు. సిద్ధిఖీని హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ ప్రకటించిన నేపథ్యంలో భద్రతను పెంచుతూ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఇక సల్మాన్ ఖాన్ ఎక్కడికి వెళ్లినా పోలీసుల నిఘాలోనే ఉండనున్నాడు. సల్మాన్‌కు చెందిన పన్వేల్ ఫామ్‌హౌస్ చుట్టూ పోలీసులు భద్రతను పెంచారు. ఫామ్ హౌస్‌లోకి వెళ్లి, వచ్చే వారిని పర్యవేక్షించేందుకు సిబ్బందిని సైతం నియమించారు. సల్మాన్ ఖాన్‌ను హత్య చేస్తామంటూ గతంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరించింది.

## అప్పు ఇచ్చిన,తీసుకున్న తగిన నిబంధనలు పాటించాలి

**-లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య**





పెద్దమందడి ప్రజా స్వేచ్ఛ
పెద్దమందడి(M) జగత్ పల్లి గ్రామంలో మంగళవారం వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. ఉత్తరయ్య గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ అవసరాలకు అప్పుగా తీసుకునేటప్పుడు ఇచ్చేటప్పుడు తగిన నిబంధనలు పాటించాలని అన్నారు. మోటార్ వెహికల్స్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

సంపాదకీయం

# సమిష్టి నిర్ణయాలకు మోడీ పాతర

మరోమారు పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మొన్నటి హర్యానా, కాశ్మీర్ ఎన్నికల్లో మాత్రం బిజెపి హర్యానాలో అధికారం నిలబెట్టుకుంది. ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాబోతున్నాయి. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. ఇదే క్రమంలో జమిలి ఎన్నికలపై ప్రధాని మోడీ పట్టుదలగా ఉన్నారు. ఇలా వరుస ఎన్నికలు నిజంగానే దేశానికి మంచిది కాదు. దేశ ఆర్థిక వ్యవస్థపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వరుస ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీలకు లబ్ది చేకూరుస్తున్నాయే తప్ప ప్రజలకు కాదు. దీనిపై ఆలోచన చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిందే. ఇకపోతే ప్రధాన నిర్ణయాలన్నీ ఏకపక్షంగా తీసుకోవడం సరికాదు. మిత్రపక్షాలతో పాటు, అఖిలపక్షంలో కూడా చర్చించి నిర్ణయాలు తీసుకుంటే మంచిది. ఇలా ఓ మంచి సంప్రదాయానికి మోడీ శ్రీకారం చుట్టాలి. విపక్షాల అభిప్రాయాలు కూడా స్వీకరించాలి. దేశ ఆర్థికపరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ధరలు విపరీతంగా పెరుగుతు న్నాయి. ప్రజలు బతకలేని దుర్భర పరిస్థితులు తరుముకు వస్తున్నాయి. అయినా పట్టించుకోవడం లేదు. జిఎస్టీ వసూళ్లు పెరగడం ఘనతగా చాటుకుంటున్నారు. ఇకపోతే ప్రధానిగా మోడీ నిర్ణయాలు తీసుకుంటు న్నారే తప్ప వాటి పర్యవసానాలను పరిశీలించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించు కోకుండా ఆర్థిక సంస్కరణల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి సమస్యలపై ఆర్థిక నిపుణులు, విపక్షాలతో చర్చించాలి. దేశం కోసం సమిష్టి నిర్ణయాలు తీసుకుంటే మంచింది. త్వరలోనే మరిన్ని ఎన్ని కలు రాబోతున్నాయి. ఈ క్రమంలో ప్రజలను బోల్తా కొట్టించే మాటలు తప్ప పటిష్టమైన అభివృద్ధి చర్యలు కానరావడం లేదు. పదేపదే కాంగ్రెస్‌ను ఇంకా విమర్శించడం ద్వారా మోడీ తన అసమర్థతను బయట పెట్టుకుంటున్నారు. జిఎస్టీ వాతలు వద్దు బాబోయ్ అంటున్నా మోడీ చెవికెక్కడం లేదు. జిఎస్టీ సామాన్యుల కు మరణశాసనంగా మారింది. దేశంలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే సామాన్యులు బతికి బట్టకట్టడం దుర్లభంగా మారనుంది. పెరుగుతున్న ధరలకు తోడు జిఎస్టీ భారాం అంతాఇంతా కాదు. బిజెపిని ప్రజలు నమ్మనంతగా ఇప్పుడు దేశంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. వ్యక్తిగతంగా నష్టపోయే ప్రమాదేమీ మోడీకి లేకపోవచ్చు. ఆయన పదేళ్ల కాలంలో కార్పోరేట్ కంపెనీలు మరింత బలపడుతున్నాయి. పదేళ్ల క్రితం బిజెపి వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న దశలో ..బిజెపి అధికారంలోకి వచ్చినా సమస్యలు మాత్రం మరింతగా చుట్టుముట్టాయి. పదేళ్ల క్రితం అన్ని వస్తువుల ధరలు పోల్చి చూస్తే మనం ఎంతగా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకుండా పోతోంది. ఇకపోతే బలముందన్న ధోరణిలో మోడీ కూడా మిత్రపక్షాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. మొన్నటి ఎన్నికల్లో కొద్దిమేర ప్రజలు హెచ్చరికలు చేసినా..మోడీ తిరిగి ప్రధాని కావడంతో పాతపద్దతిలోనే ముందుకు సాగుతున్నారు. విపక్షాల వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. సమస్యలపై చర్చించడం లేదు. కనీసంగా ఎన్‌డిఎ పక్షాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం లేదు. పూర్తిస్థాయి మెజార్టీ ఉండడం వల్ల నడుచుకున్న తీరుగానే ఇప్పుడు తన పాలనా ధోరణిని కొనసాగిస్తున్నారు. సొంత పార్టీలోనూ మోడీని ఎదరించేవారు లేకపోవడంతో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.అయితే తనకు తిరుగు లేదన్న ధోరణి ప్రవర్తిస్తే ప్రజలు తమకు అవకాశం వచ్చిన సమయంలో తడాఖా చూపుతారు. అప్పుడు నష్టపోయేది మాత్రం బిజెపియే. రానున్న ఎన్నికల్లో తాయిలాలు ప్రకటించే బదులు ప్రజలు ఏ రకంగా ఇబ్బందులు పడుతున్నారో గుర్తించి నిర్ణయాలు తీసుకుంటే మంచింది. లేకుంటే నడిస్తే నష్టపోయేది బిజెపి మాత్రమే. నియంతృత్వ పోకడలు విడనాడ కుంటే వాజ్‌పేయి, అద్వానీ లాంటి అతిరథ మహారథులు తీర్చిదిద్దిన బిజెపికి ఇక భారతదేశ చరిత్రలో రాజకీయ స్థానం ఉండకపోవచ్చు. అంతిమంగా బిజెపిని నమ్మడం అన్నది ఇక భ్రమ కాగలదు. ఇక దిక్కు లేక మళ్లీ ప్రజలు కాంగ్రెస్‌నో లేదా ఇతర మిత్రపక్షాల కూటమికో అధికారం అప్పగిస్తారు. పప్పుముద్దగా రాహుల్‌ను అభివర్ణించినా...భారత్ జోడో యాత్రతో ప్రజల్లో కదలిక తెచ్చారు. అనూహ్యంగా ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌ను తీసుకుని రాగలిగారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కూర్చున్నారు. ఈ ప్రమాదాలను బిజెపి ద్వయం గుర్తించడం లేదు. ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ పోవడం కన్నా ప్రజలను గుర్తించి, వారి సమస్యలను ఆకళింపు చేసుకుని పనిచేయడం నేర్చుకోవాలి. ఇకపోతే ఇప్పుడు మోడీని వ్యతిరేకించే పార్టీల్లో ఐక్యత వస్తోంది. ఇది కాంగ్రెస్‌కు వరం కానుంది. వాజపేయి హయాంలో ఎన్డీఏ నిర్మాణం జరిగినా అప్పుడు రాష్ట్రాల నేతలకు విలువ ఉండేది. కానీ మోదీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాధి నేతలకు ప్రాధాన్యం దక్కడం లేదు. చంద్రబాబుకు కొద్దో గొప్పో అవకాశం ఇప్పుడు వస్తోంది. గతంలో ఇలాంటి అవకాశం ఎలాగూ లేదు. కూటమినుంచి పార్టీలు తప్పుకుంటే బీజేపీ ఏకాకి కాక తప్పదు. కూలి పోవడానికి కూడా సమయం పట్టదు. అయితే బిజెపిలో నిర్ణయాలు తీసుకుంటున్న మోడీ, అమిత్‌షాలు దీనిని గుర్తించి పాలనా వ్యవహారాల్లో మార్పులకు సిద్దపడాలి.ప్రధాని మోదీ అనుసరిస్తున్న నిరంకుశ నిర్లక్ష్య వైఖరి నుంచి బయటపడాలి. ఎన్‌డిఎ పక్షాలకు విలువ ఇవ్వడం నేర్చుకోవాలి. మోదీ వైఖరి అంటే ఇష్టపడని ఎంపీలు, మంత్రులు బీజేపీలో ఉన్నప్పటికీ వారు ప్రభుత్వాన్ని పడగొట్టుకోవాలని అనుకోవడం లేదు. బీజేపీ సంకీర్ణధర్మాన్ని పాటించి, సమిష్టి నిర్ణయాలకు పెద్దపీట వేయాలి. ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న జిఎస్టీ, ధరల వంటి సమస్యలను ఎన్‌డిఎ పక్షాలతో చర్చించాలి. అప్పుడే ప్రజలకు మేలు జరగగలదు.

# రతన్ టాటాను ఆదర్శంగా తీసుకోవాలి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఏడవ శతాబ్దంలో ఇరాన్ జోరాస్టియన్లపై అరబ్‌దేశాలు దండయాత్రలు చేసిన దరిమిలా భారత ఉపఖండానికి వలస వచ్చిన బాధిత కుటుంబాల వారే టాటాల పూర్వీకులు. టాటాల వ్యాపార ఎదుగుదల పరంపరలో జంషెడ్‌జి టాటా, జేఆర్‌డి టాటా, రతన్ టాటాలు ప్రముఖులుగా చరిత్రలో నిలిచిపోయారు. 1904 సంవత్సరంలో జంషెడ్‌జి టాటా బిహార్‌లోని జంషెడ్‌పూర్‌లో భారత ఉపఖండంలోనే మొట్టమొదటి స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. కాలక్రమంగా టాటాలు గుండు సూది నుండి విమానం వరకు ఉప్పు నుండి అనేక వినియోగ వస్తువుల తయారీ పరిశ్రమలను స్థాపించి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ పారిశ్రామిక వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచారు. అనుదినం టాటా వస్తువులను ఉపయోగించకుండా ఒక్క కుటుంబం కూడా ఉండకపోవచ్చు. ఉత్పత్తి, వ్యాపార పెట్టుబడులు ఇతోధికంగా పెట్టినప్పటికీ టాటాలు సామాజిక సేవాదృక్పథం కలిగినవారని దేశంలో సాధారణ ప్రజలు కూడా గుర్తిస్తారు. జాతిపిత మహాత్మాగాంధీ ఒక సందర్భంలో ఈ దేశ పెట్టుబడిదారులలో అనేకమంది టాటాల వంటివారే కావాలని ఆకాంక్షించాడు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విచ్చలవిడిగా అమలు జరుగుతున్న ప్రస్తుత కాలంలో పెట్టుబడిదారులు, అవినీతిపరులైన ఉన్నతాధికారులు, దోపిడిచేసే రాజకీయ నాయకులు కుమ్మక్కై, తమ పరస్పర ప్రయోజనాల కోసం రాజకీయాలను వ్యాపారపెట్టుబడులను సమ్మిళితం చేసి అక్రమార్జనలకు ఎగబడుతున్న రోజులివి. మనదేశంలో క్రోనీ క్యాపిటలిజం అతివేగంగా విస్తరిస్తున్న పరిస్థితులలో టాటా సంస్థల వ్యాపారాలు అందులో భాగస్వామ్యం ఆశించకపోవడం ఒక గొప్ప విశేషం. ఈ నెల తొమ్మిదవ తారీకు తుది శ్వాస విడిచిన రతన్ టాటా ఒక విశిష్టమైన సామాజిక స్పృహ కలిగిన వ్యాపారవేత్త అని సాధారణ ప్రజలు కూడా కొనియాడుతున్నారు. ఆయన లేని లోటును తీర్చలేమని అనేకమంది జాతీయ అంతర్జాతీయ ఉన్నతశ్రేణి మహనీయులు ఆందోళన వెలిబుచ్చారు. రతన్ టాటా ఒక గొప్ప మానవతావాది. సామాజిక సంక్షేమం కోసం నిత్యం తపించిన పెట్టుబడి వ్యాపారవేత్త. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వొణికిస్తున్న సందర్భంగా అనేక ప్రైవేట్ వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజలను పీల్చి పిప్పిచేసిన ఉదంతాలు ఎన్నెన్నో. కానీ రతన్ టాటా తన కంపెనీల లాభాల నుండి 1500 కోట్ల రూపాయలు భారత ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. అనేక ఆరోగ్య వైద్య సంస్థలు, గ్రామీణ అభివృద్ధి, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు నెలకొల్పి దేశ ప్రజల కోసం తన వంతు బాధ్యతను నిర్వహించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్య కొరకై పెద్ద మొత్తంలో ఉపకార వేతనాలు ఇస్తున్నారు. తన సంపాదన కంటే ప్రజల సంక్షేమం ముఖ్యమని భావించిన మానవతావాది రతన్ టాటా. అమెరికాలో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లభించినప్పటికీ అంగీకరించక, దేశ అభివృద్ధిలో తనవంతు కృషి చేయాలని అనేక ఉత్పత్తి వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసిన గొప్ప జాతీయవాది. ఎంతో సంపదకు వారసుడైనప్పటికీ సాధారణ జీవితానికి ప్రాధాన్యతనిచ్చిన నిరాడంబర వ్యక్తిత్వం రతన్ టాటాది. ధరల పెరుగుదల, నిరుద్యోగిత, ఆర్థిక అసమానతలు ఉన్న పరిస్థితులలో ప్రస్తుత ఆధునిక అత్యున్నతస్థాయి పెట్టుబడిదారులు లాభాల వరదల్లో జలకాలాడుతున్నారు కానీ, తమ లక్షల కోట్ల రూపాయల లాభాల్లో పేద ప్రజల యోగక్షేమాలకు, విద్య వైద్య సౌకర్యాలకు తమ వంతుగా కొంత ఇవ్వడానికి, కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ముందుకు రావలసిన సందర్భం ఇది. తెలంగాణ రాష్ట్రంలో కూడా గత పది సంవత్సరాలలో అనేకమంది కార్పొరేట్ దిగ్గజాలుగా ఎదిగిన ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత పది సంవత్సరాల విధ్వంసపు పరిపాలనలో భాగంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు దయనీయమైన స్థితిలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉంది. ఈ రెండు రంగాలను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర సంపన్న వర్గాలు ప్రభుత్వానికి చేయూతనిచ్చి రతన్ టాటా నుంచి స్ఫూర్తిని పొందాలి. రాష్ట్ర అభివృద్ధిలో తమ పాత్ర పోషించి ప్రజల మన్ననలు పొందడానికి కృషి చేస్తే టాటాల లాగా చరిత్రలో నిలిచిపోతారు. రతన్ టాటా దాతృత్వం, మానవతావాదం, జాతీయవాదం లాంటి లక్షణాలన్నీ పుణికిపుచ్చుకొని ఆధునిక పెట్టుబడిదారులు తమవంతు కర్తవ్యాన్ని నెరవేర్చవలసి ఉంది. గాంధీ మహాత్ముడు ఆకాంక్షించిన విధంగా ఈ దేశానికి దళారీ పెట్టుబడిదారులు కాకుండా రతన్ టాటా వంటి మానవతావాద పెట్టుబడిదారులు అవసరం.

# జి.ఎన్. సాయిబాబా హఠాన్మరణం దేశంలోని ప్రజాస్వామికవాదులందరినీ విషాదంలో ముంచెత్తింది



దాదాపు పదేళ్ల జైలు జీవితంలో, తన నిర్బంధాన్ని, దేశంలోని హక్కుల అణచివేతను నిర్విరామంగా వ్యతిరేకిస్తూ, స్వేచ్ఛ కోసం పోరాడిన సాయిబాబా, నిర్దోషిగా విడుదలైన ఏడునెలలకే, ఆ స్వేచ్ఛను కనీసంగా కూడా అనుభవించకముందే కన్నుమూయడం పెద్ద విషాదం. ఈ మరణం కేవలం ఆకస్మికమో, అనారోగ్య ఫలితమో కాదని నిస్సందేహంగా తెలిసిపోతున్నప్పుడు, ఇంతటి కర్కశత్వాన్ని, క్రూరచట్టాలను ప్రయోగించే ప్రభుత్వాల ముందు నిస్సహాయంగా, బాధితంగా మాత్రమే భారత సమాజం మిగిలిపోవడం, మానవీయత నానాటికి కొత్త పతనాలకు చేరుకోవడం అందరినీ ఆవరిస్తున్న పెను విచారం. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ 2 ప్రభుత్వం అవసాన కాలంలోనే సాయిబాబాపై మొదలైన వేధింపులు, బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తీవ్రమయ్యాయి. ప్రజాస్వామిక, ఉదారవాద, వామపక్ష, పర్యావరణ వాద తదితర పౌరసమాజ శక్తులన్నిటినీ అశక్తులను చేయడం, వారి నైతిక బలాన్ని దెబ్బతీయడం, వారిని దేశవ్యతిరేక శ్రేణులుగా పరిగణించడం, వంటి ప్రణాళికను అనుసరించిన నరేంద్రమోదీ ప్రభుత్వం, వాటి అమలులో అనుసరించిన నిర్దాక్షిణ్యవైఖరికి సహజ ప్రతిక్రియగా రూపొందిన ప్రతిఘటనా ప్రతీక సాయిబాబా. మత భావోద్వేగాలతో సమాజాన్ని మైమరిపింపజేయగలిగినప్పుడు, రాజకీయ విధాన నిర్ణయాలకు ఏ నైతిక సమర్థనలూ అవసరం లేదన్న బలాదూర్ ధోరణి పాలకులలో ఏర్పడుతుంది. పదేళ్ళుగా, పాలకశ్రేణుల్లోని రాజకీయ ప్రత్యర్థుల మీద, ప్రజా ఉద్యమాల నాయకుల మీద, కార్యకర్తల మీద అనుసరిస్తున్న నిర్బంధ విధానాలు కనీస రాజ్యాంగ ప్రాతిపదికలను కూడా ఖాతరు చేయని స్థితి చూశాము. సాయిబాబా కేసు తరువాత, బీమా కోరేగావ్ కుట్ర కేసు. అధ్యాపకుడు, అట్టడుగు వర్గాల కోసం ఆలోచించి, ఆచరించే బుద్ధిజీవి, సుదీర్ఘంగా ప్రజా ఉద్యమాల అనుభవశాలి అయిన సాయిబాబాను 'ఊపా' కింద, ఇంకా అనేక చట్టాల కింద అభియోగాలను మోపి, యావజ్జీవ శిక్ష విధింపజేసి నాగపూర్ జైల్‌లో నిర్బంధించారు. విచారణ కాలంలో బెయిల్ ఇవ్వలేదు. నిర్బంధ కాలంలో సరైన వైద్య సహాయం అందించలేదు. 90 శాతం వైకల్యం ఉన్న సాయిబాబాకు నేర పరిశోధన, న్యాయ పాలన రంగాలు చేసిన అన్యాయంతో పాటు, కారాగార అధికారుల నియమోల్లంఘన, నిరాదరణ వల్ల ఆరోగ్యం శిథిలమవుతూ వచ్చింది. ఆయన సహచరి వసంత నిరంతరం జైలులో సాయిబాబా స్థితిగతులను బయటి ప్రపంచానికి నివేదిస్తూ వచ్చారు. చిన్నపాటి కనీస వసతికి కూడా విజ్ఞప్తులు, సంతకాల సేకరణలు కావలసి వచ్చేది. ప్రభుత్వ విధానంలో ముఖ్యమైనది స్పందనారాహిత్యం. కోవిడ్ వచ్చినప్పుడూ, ఇతర ఆరోగ్య సమస్యల కాలంలోనూ ఆస్పత్రికి తరలించడానికి కూడా అంగీకరించని కాఠిన్యం అధికారులది. అతని నిర్బంధం విషయంలో ప్రభుత్వం పట్టింపుకు అతి దారుణమైన ఉదాహరణ, తల్లి మరణించినప్పుడు పెరోల్ అనుమతించకపోవడం, కనీసంగా వీడియో చూపులకు కూడా ఒప్పుకోకపోవడం. బిల్కిస్ బానో కేసులో దోషులను విడుదల చేయడంలో, వారికి పెరోళ్లు ఇవ్వడంలో అత్యుత్సాహం చూపిన ప్రభుత్వం, సాయిబాబా జైలు దాటకుండా చేయడానికి మాత్రం, చరిత్రలో మునుపెన్నడూ వినని ఆత్రుత చూపింది. 2022లో బొంబాయి హైకోర్టు మొదటిసారి, నేరాభియోగం సరైన పద్ధతులలో జరగలేదన్న కారణాలతో కేసును కొట్టివేసినప్పుడు, సాయిబాబాను విడుదల కాకుండా చూడడానికి రాత్రికి రాత్రి సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. మరుసటి రోజు పొద్దునే కేసు వినేట్టు చేసుకోవడం, నిర్దోషిత్వ తీర్పు మీద స్టే తెచ్చుకోవడం ఆశ్చర్యకరమైన రీతిలో జరిగిపోయాయి. ఎందుకు ఆయన నిర్బంధం మీద అంతటి పట్టుదల? అప్పటికి సాయిబాబా నిర్బంధాన్ని పొడిగించగలిగారు కానీ, ప్రజల దృష్టికి ప్రభుత్వ కార్పణ్యం ప్రస్ఫుటమయింది! జైలులో స్టాన్ స్వామి మరణం, పాలకులకు ఏ తృప్తి కలిగించిందో కానీ, వ్యవస్థ క్రౌర్యం మీద ప్రజలకు ఏవగింపే కలిగించి ఉంటుంది కదా? తెలుగు విప్లవకవి వరవరరావును అనారోగ్యంలో ఎంతటి ఇబ్బంది పెట్టారు? బెయిల్‌ను కూడా ఆంక్షలతో బంధించి బొంబాయి దాటి కదలకుండా చేశారు! ప్రభుత్వాలపై ప్రజాస్వామికమైన ఒత్తిడి తేవడానికి, ప్రజలలో విమర్శనాత్మక చైతన్యం కలిగించడానికి, ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించడానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో జరిగే ప్రయత్నాలను దెబ్బతీయడం కోసమే కాకపోతే, ఈ నిర్బంధ విధానాలకు అర్థం ఏమిటి? ప్రజలను చైతన్యపరుస్తారన్నది మినహాయిస్తే, ఈ ప్రజాకార్యకర్తలు రాజ్యం మీద యుద్ధమో, అందుకు కుట్రనో చేస్తున్నారన్నది ఏ రకంగా వాస్తవం? నిర్దోషిగా న్యాయస్థానం అంగీకరించడానికి ముందు పదేళ్ల యాతన కొనసాగింపే సాయిబాబా మరణం. ప్రజాస్వామ్యం నాలుగు స్తంభాలూ ఈ అన్యాయంలో భాగస్వాములే. కఠినచట్టాలు, జాతీయ ఏజెన్సీలు, వినయవిధేయ న్యాయస్థానాలు, ఎంతగా నిరంకుశత్వానికి వేదికలయినా, ఆ ప్రయత్నాలన్నీ నైతికంగా నిస్సారమైనవి. దీర్ఘకాలం జైళ్లలో మగ్గినా, వారి నిర్బంధం వల్ల బంధుమిత్రులూ, సమాజమూ ఎన్ని అష్టకష్టాలు పడినా ప్రజాకార్యకర్తలే నైతికంగా బలశాలురుగా నిలబడతారనడానికి సాయిబాబా ఒక ఉదాహరణ. నిర్బంధంలో ఆయన గొప్ప కవిగా గొంతు సవరించుకున్నారు. కబీరులో తాత్వికప్రతిబింబాన్ని చూసుకున్నారు. తనతో, సమాజంతో కొత్త సంభాషణ మొదలుపెట్టారు. తీక్షణమైన చూపులు, మొహం మీద స్థిరపడిన సన్నటి నవ్వు, ఎక్కడా దైన్యం కనబడని కవళికలు, పరిమితిగాకాక, తన శరీరంలో ఒక భాగంగా ఒదిగిపోయిన వీల్ చెయిర్, సాయిబాబా మీద ఆరాధనతో కూడిన గౌరవాన్ని కలిగిస్తాయి. తీవ్రమైన హింసను, వేదనను తట్టుకోగలిన సహిష్ణుత, అదే సమయంలో సడలింపు లేని వ్యక్తిత్వం, ఈ రెండూ కలిసి, ఆయనను ఒక మహాబలశాలి అయిన ప్రతీకను చేశాయి.




Printed, published and Owned by Tarigoppula Mahender, Printers Karshak Art Printers,Hyderabad
and Published by office 2-6-376, Jaipuri Colony, Nagole Village, Uppal Mandal, District Ranga Reddy,Post GSI, 500068-Telangana
RNI No. APTEL/2012/46853. E Mail. ID: prajaswecha@gmail.com, Web Site, www.prajaswecha.com cell 9381910611,7989289492